www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 10 ఏప్రిల్ 2023

5

పశ్చిమ గోదావరి



ఆగర్రు ఎంపిటిసి రత్నకుమారి మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని ఆగర్రు గ్రామానికి చెందిన ఎంపిటిసి కొయ్య రత్నకుమారి (40) శనివారం రాత్రి మృతి చెందారు. ఆమె కొద్దికాలంగా కేన్సర్‌తో బాధపడుతున్నారు. వైసిపి తరపున ఆగర్రు ఎంపిటిసిగా ఎన్నికయ్యారు. ఇటీవల ఎంఎల్‌సి ఎన్నికల్లో వీల్‌ఛైర్‌పై వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. రత్నకుమారి మృతి పట్ల స్థానిక ఎంఎల్‌ఎ డాక్టర్ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, ఆగర్రు సర్పంచి సాక గంగారత్నం, ఎంపిపి చిట్టూరి కనక లక్ష్మీ ఏడుకొండలు, వైస్ ఎంపిపిలు యన్నబత్తుల నాగేశ్వరరావు, పడవల సునీల్ బాబు, టిడిపి నేత సాగ సత్యనారాయణ, ఎంపిడిఒ సంగాని వెంకటేశ్వరరావు, ఇఒఆర్‌డి ఎ.షరీఫ్ రత్నకుమారి మృతి పట్ల సంతాపం తెలిపారు.

వీక్లీ ఆఫ్ అమలేది..!



ప్రభుత్వ హామీలు బుట్టదాఖలు

రెండు జిల్లాల్లోనూ అమలు కాని వీక్లీఆఫ్

'పశ్చిమ' ఎస్‌పి ఆదేశాలిచ్చినా స్టేషన్ అధికారులు బేఖాతరు

గుగూల్ షీట్‌లో వీక్లీఆఫ్ లెక్కల మాయాజాలం

చూసీచూడనట్లుగా స్పెషల్ బ్రాంచ్ అధికారులు

మహిళా పోలీసులకు అనధికారిక విధులు?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలీస్ సిబ్బందికి ప్రకటించిన వీక్లీఆఫ (వారాంతపు సెలవు) ఇప్పటికీ అమలుకాని పరిస్థితి నెలకొంది. 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు' అనే చందంగా పోలీసుల వీక్లీ ఆఫ్ తయారైంది. పోలీస్ ఉద్యోగం నిత్యం ఒత్తిడితో కూడుకున్నది. ఒత్తిడిని తగ్గించి కుటుంబంతో గడిపేందుకు వీక్లీ ఆఫ్ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పోలీసులకు వారాంతపు సెలవు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అందుకు సంబంధించి ఉత్తర్వులు సైతం జారీ చేసింది. ప్రభుత్వం అధికారంలోకొచ్చి నాలుగేళ్లు పూర్తవుతున్నా ఇప్పటికీ పోలీసుల వీక్లీఆఫ్ సక్రమంగా అమలుకాని పరిస్థితి నెలకొంది. కొన్ని జిల్లాల్లో ఎస్‌పిలు వీక్లీ ఆఫ్ ఆమలుపై ఆదేశాలిచ్చినా స్టేషన్ అధికారులైన సిఐ, ఎస్‌ఐలు అమలు చేయని పరిస్థితి ఉంది. రెండు జిల్లాల్లోనూ దాదాపు 2500 మంది వరకూ పోలీస్ సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారంలో ఒకరోజు వీరికి వీక్లీ ఆఫ్ అమలు చేయాల్సి ఉంది. రెండు జిల్లాల్లోనూ ఎక్కడా అమలు కావడం లేదు. పశ్చిమగోదావరి జిల్లాలో వీక్లీఆఫ్ అమలుపై ఎస్‌పి రవిప్రకాష్ ఆదేశాలచ్చినా అమలు చేయని దుస్థితి నెలకొంది. సిబ్బందికి వీక్లీ ఆఫ్ వివరాలను ప్రతిరోజూ గూగుల్ షీట్‌లో నమోదు చేయాలని ఎస్‌పి ఆదేశించారు. సిబ్బందికి వీక్లీఆఫ్ ఇవ్వకపోయినా గూగుల్ షీట్‌లో నమోదు చేస్తూ ఉన్నతాధికారులను ఏమారుస్తున్నట్లు తెలిసింది. ఎస్‌పికి రెండు కళ్లలా వ్యవహరించాల్సిన స్పెషల్ బ్రాంచ్ అధికారులు సైతం ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియపరచకపోవడం ఆశ్చర్యం కల్గిస్తోంది. గూగుల్ షీట్‌లో నమోదు చేసిన తర్వాత వీక్లీ ఆఫ్ ఇవ్వకపోవడంపై సిబ్బందిలోనూ తీవ్ర ఆవేదన నెలకొంది. వీక్లీఆఫ్ అమలులో కొనసాగుతున్న నిర్లిప్తతను సిబ్బంది మౌనంగా భరిస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లలేక, స్టేషన్ అధికారులను అడగలేక సతమతమవుతున్న పరిస్థితి ఉంది. పోలీసులకు వీక్లీ ఆఫ్ అమలుపై ప్రభుత్వం సైతం కచ్చితమైన ఆదేశాలు జారీ చేసి అమలు చేసేలా పర్యవేక్షించాలని సిబ్బంది కోరుతున్నారు.

అనధికారికంగా మహిళా పోలీసులకు విధులు

మహిళా పోలీసులుగా పిలుస్తున్న (సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు)కు పోలీస్ అధికారులు అనధికారికంగా విధులు కేటాయిస్తున్నారు. నిబంధనల ప్రకారం మహిళా పోలీసులకు బందోబస్తు విధులు కేటాయించకూడదు. సచివాలయ ఉద్యోగులకు వర్తించే సెలవులు, కార్యాలయానికి వచ్చే సమయానికి సంబంధించిన నిబంధనలే వీరికి వర్తిస్తాయి. అయితే మహిళా పోలీసులకు నిబంధనలకు విరుద్ధంగా విధులు కేటాయిస్తూ వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మహిళా పోలీసులకు బందోబస్తు విధులు కేటాయించబోమని ప్రభుత్వం కోర్టుకు సైతం తెలిపింది. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా సాగుతోంది. సిఎం పర్యటనలు, ప్రభుత్వం నిర్వహించే ఉద్యోగ రాత పరీక్షల కేంద్రాల వద్ద బందోబస్తుకు మహిళా పోలీసులను ఉపయోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం బందోబస్తు విధులు నిర్వహించే పోలీసులకు టిఎ, డిఎలు వర్తిస్తాయి. సిఎం పర్యటన మధ్యాహ్నానికి అయిపోతే పోలీస్ సిబ్బంది నేరుగా ఇంటికి వెళ్లిపోతారు. అదే మహిళా పోలీసులైతే సచివాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. ఇంటికెళ్తే పంచాయతీ కార్యదర్శి ఊరుకోరు. మహిళా పోలీసులకు అనధికారికంగా విధులు కేటాయించడం వల్ల ఏఒక్క సౌకర్యమూ వీరికి వర్తించడం లేదు. దీంతో ఛార్జీల వంటి ఖర్చులు సొంతంగానే భరించాల్సిన దుస్థితి నెలకొంది. పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులకు విధులు కేటాయించాలి. అయితే ప్రస్తుతం ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒకరిద్దరు మహిళా పోలీసులకు విధులు కేటాయించారు. పోలీస్ సిబ్బందికి విధుల కేటాయింపునకు సంబంధించి ఇచ్చే పాస్‌పోర్టు వంటివేమీ వీరికి ఇవ్వడం లేదు. సచివాలయ ఉద్యోగులు ఉదయం పది గంటలకు విధులకు హాజరుకావాలి. అయితే మహిళా పోలీసులను ఉదయం ఎనిమిదిగంటలకే పరీక్షా కేంద్రాల వద్దకు పంపిస్తున్నారు. మధ్యాహ్నం రెండుగంటల వరకూ విధులు నిర్వహించి మళ్లీ సచివాలయానికి వెళ్లాల్సి వస్తోంది. కొన్నిసార్లు అర్ధరాత్రి వరకూ కూడా విధులు నిర్వహించాల్సి వస్తోంది. మహిళా పోలీసుల విధుల విషయంలో స్టేషన్ అధికారులు తీరు వివాదాస్పదంగా మారుతోంది. మహిళా పోలీసుల విధుల విషయంలోనూ జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నిబంధనలు అమలు చేయాలని అంతా కోరుతున్నారు.



సవాలక్ష సమస్యలతో ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగులు సతమతం

ప్రభుత్వ ఉద్యోగి నుంచి రూ.మూడు లక్షల పూచీకత్తు తప్పనిసరి

ఉద్యోగాలకే టెండర్ పెట్టేలా ఏజెన్సీ నిర్ణయం

ఆందోళనలో ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగులు

జీతం తక్కువ.. నిబంధనలు ఎక్కువ..!

ప్రజాశక్తి - భీమవరం

వాళ్లంతా ఎంటెక్, బిటెక్, డిగ్రీ వంటి ఉన్నత చదువులు చదివిన వారే. ఉద్యోగావకాశాలు లేక ప్రభుత్వ మద్యం దుకాణాల్లో చిరుద్యోగులుగా చేరారు. వీరికి జీతం తక్కువ.. నిబంధనలు ఎక్కువ. వీరికి జీతభత్యాలు చెల్లించే ఒక ఏజెన్సీ తీసుకున్న నిర్ణయాలపై ఆ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఉద్యోగం ఉండాలంటే రూ.3 లక్షలతో కూడిన ప్రభుత్వ ఉద్యోగి పూచీకత్తు తప్పనిసరి అని నిబంధన పెట్టింది. ఇది చాలదన్నట్లు ప్రభుత్వ ఉద్యోగి రూ.40 వేలు వేతనం కలిగి ఉండాలని, ఐడి కార్డు, పే స్లిప్‌లు కూడా ఇవ్వాలని హుకుం జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాల చిరుద్యోగులు సవాలక్ష సమస్యలతో సతమతమవుతున్నారు.

నాలుగేళ్ల క్రితం జగన్ తన పాదయాత్రలో మద్యపాన నిషేధం అమలు చేస్తానని హామీ ఇచ్చారు. ఏళ్లు గడుస్తున్నా హామీ అమలు చేయకపోగా ప్రభుత్వమే మద్యాన్ని అమ్మించే పరిస్థితికి వచ్చింది. మొదట్లో మద్యాన్ని నియంత్రిస్తున్నామని చెబుతూనే మద్యం అమ్మకాలు ప్రధాన ఆదాయ వనరుగా భావించి ప్రభుత్వం మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణ బాధ్యతను ఎక్సైజ్ శాఖ చూస్తోంది. ఉన్న ఊరిలో ఉద్యోగం కావడంతో జీతం తక్కువైనా అప్పట్లో మద్యం దుకాణాల్లో పని చేసేందుకు ఉన్నత విద్యావంతులు సైతం క్యూ కట్టారు. ఉన్న ఉద్యోగమే గొప్ప అని సర్దుకుపోతున్నారు. అయితే ఇప్పుడు వారి ఉద్యోగ భద్రతపై నీలినీడలు కమ్ముకున్నాయి. కఠిన నిబంధనల పేరుతో కొలువులకు ఎసరు పెట్టేందుకు ఏజెన్సీ సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే యువకుల దీనగాథ మాటల్లో చెప్పలేనిది.

జిల్లా వ్యాప్తంగా 109 మద్యం దుకాణాలు ఉన్నాయి. సుమారు 387 మంది వీటిలో పని చేస్తున్నారు. అప్పట్లో వైసిపి ప్రభుత్వం ఈ నియామకాలు చేపట్టింది. సేల్స్‌మెన్‌కు ఇంటర్ అర్హత, సూపర్‌వైజర్ పోస్టుకు డిగ్రీ అర్హతతో నియామకాలు చేపట్టారు. అయితే ఉద్యోగ ఖాళీల భర్తీ చేపట్టకపోవడం తదితర పరిణామాల రీత్యా డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ చేసిన వారు సైతం ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసేందుకు ముందుకొచ్చారు. అయితే అప్పట్లో విధులు సాఫీగా సాగినప్పటికీ రానురాను చిరుద్యోగం సైతం పెనుభారంగా మారింది. తాజాగా ఏజెన్సీ నిర్వాకంతో వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఏజెన్సీలతో తలనొప్పులు

మొదట్లో ప్రభుత్వమే ఉద్యోగ నియామకాలు చేపట్టి సూపర్‌వైజర్లకు రూ.21,500, సేల్స్‌మెన్స్‌కు రూ.18,500 జీతభత్యాలు ఇచ్చేలా నిర్ణయించింది. పిఎఫ్ కటింగ్ పోను ప్రస్తుతం సూపర్‌వైజర్‌కు రూ.19,500, సేల్స్‌మెన్‌కు రూ.17,500 చేతికొస్తుంది. వీరికి జీతభత్యాలు చెల్లించేందుకు 2019లో రెడ్డిఅండ్‌రెడ్డి ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారు. నాలుగేళ్లపాటు ఈ ఏజెన్సీ నిర్వహణ బాధ్యత చూసింది. అయితే అప్పట్లో ఈ ఏజెన్సీ ఉద్యోగులను ముప్పుతిప్పలు పెట్టింది. ఈ ఏజెన్సీ ప్రతినెలా సక్రమంగా జీతాలు ఇచ్చిన దాఖలాల్లేవని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. దీంతో 2022లో ఉద్యోగ నిర్వహణ బాధ్యతను థర్డ్ ఎంప్లాయిస్ ఏజెన్సీకి అప్పగించారు. ఇటీవల కొత్తగా ఏజెన్సీ తీసుకొచ్చిన నిబంధన ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న వందలాది మంది యువకుల నెత్తిన పిడుగు పడినంత పనైంది. ఈ ఏజెన్సీ విధించిన నిబంధనలు ఉన్న ఉద్యోగాన్ని ఊడగొట్టే విధంగా ఉన్నాయని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.3 లక్షలకు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల పూచీకత్తు తప్పనిసరి

మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లుగా చేరే సమయంలో వారి ఆస్తి దస్తావేజులు పెట్టి, లేదా బాండ్‌పేపర్లపై సంతకాలు చేసి ఉద్యోగాల్లో చేరారు. నాలుగేళ్ల అనంతరం థర్డ్ ఎంప్లాయిస్ ఏజెన్సీ కొత్త నిబంధన తీసుకొచ్చింది. మద్యం దుకాణాల్లో పని చేయాలంటే రూ.3 లక్షలకు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల చేత పూచీకత్తు సంతకాలు తీసుకు రావాలని హుకుం జారీ చేసింది. అంతేకాకుండా సదరు ప్రభుత్వ ఉద్యోగి ఐడి కార్డు, పే స్లిప్‌లు కూడా ఇవ్వాలని పేర్కొంది. ఇవన్నీ సమర్పిస్తేనే ఉద్యోగం ఉంటుందని, లేకపోతే తీసేస్తామని ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఇది చాలదన్నట్లు సదరు ప్రభుత్వ ఉద్యోగి జీతం రూ.40 వేలకు తక్కువ కాకుండా ఉండాలనే నిబంధన కూడా పెట్టింది. ఒక సర్టిఫికేట్ మీద గెజిటెడ్ సంతకం చేయమంటేనే ఉద్యోగులు భయపడిపోయే పరిస్థితుల్లో అలాంటిది పూచీకత్తు సంతకం, ఐడి కార్డు, పే స్లిప్‌లు ఎలా ఇస్తారని సేల్స్‌మేన్లు, సూపర్‌వైజర్లు ప్రశ్నిస్తున్నారు. ఈ ఏజెన్సీ తీసుకొచ్చిన నిబంధనలు అసలు ఉద్యోగం ఉంచడానికా, తీసేయడానికా అనే విధంగా ఉన్నాయని మద్యం దుకాణాల సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత పది రోజులుగా ఇటు ఏజెన్సీ, అటు ఎక్సైజ్ అధికారుల నుంచి ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో చిరుద్యోగులు మానసిక ఒత్తిడికి గురై ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు.

కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి విధుల నిర్వహణ

కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి కనీస ఉద్యోగ భద్రత లేనప్పటికీ సదరు ఉద్యోగులు మద్యం దుకాణాల్లో పని చేశారు. ఈ నేపథ్యంలో కొంతమంది ప్రాణాలు పోగొట్టుకోవడంతోపాటు మరికొంతమంది తీవ్ర అనారోగ్యానికి గురై వేలాది రూపాయలు వైద్యానికి ఖర్చుపెట్టిన ఘటనలూ ఉన్నాయి. ఇదిలా ఉంటే ప్రభుత్వానికి వేల కోట్ల ఆదాయం తీసుకొస్తున్న తమ పట్ల ప్రభుత్వం తీరు దారుణంగా ఉందని సంబంధిత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఏజెన్సీ నిర్ణయాలను ఉపసంహరించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విశ్వమానవ వేదిక అన్నదానం @ 2700 రోజులు

ప్రజాశక్తి - పాలకొల్లు

నిరాశ్రయులైన వృద్ధుల ఆకలి తీరుస్తున్న విశ్వమానవవేదిక నిత్యాన్నదానానికి 2,700 రోజులు మైలురాయి చేరుకుంది. పాలకొల్లు పట్టణంతోపాటు పోడూరు మండలం వేడంగి, వేడంగిపాలెం, కుమ్మరిపాలెం, కొమ్ముచిక్కాల, జిన్నూరుపాలెం, పాలకొల్లు మండలంలోని వడ్లవానిపాలెం గ్రామాల్లో ఆదరణ లేని నిరుపేద వృద్ధులు, వికలాంగులకు వారు నివశిస్తున్న చోటుకే భోజనం అందిస్తున్నామని విశ్వమానవ వేదిక అధ్యక్షుడు మల్లుల సురేష్ తెలిపారు. పాలకొల్లులో 2015 నవంబర్ 17న ప్రారంభించిన విశ్వమానవ వేదిక నిత్యాన్నదాన సేవలు అనేక గ్రామాలకు విస్తరిస్తూ 2700 రోజులు పూర్తి చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆదివారం పాలకొల్లులోని విశ్వమానవ వేదిక ఉచిత వృద్ధాశ్రమం ఆవరణలో 2,700 రోజుల కార్యక్రమం నిర్వహించారు. భవిష్యత్తులో మరిన్ని గ్రామాలకు నిత్యాన్నదానం సేవలు విస్తరిస్తామని సురేష్ తెలిపారు. అనేక ఒడిదుడుకులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు తట్టుకుని అకుంఠిత దీక్షతో అభాగ్యుల ఆకలి తీర్చేందుకు కృషి చేస్తున్న విశ్వమానవ సభ్యులకు అభినందనలు తెలిపారు. సభ్యులు గుంపుల రవి, డాక్టర్ మల్లుల జ్ఞానేశ్వరి, గంగాధర్, వాసంశెట్టి సుబ్బారాయుడు, పెచ్చెట్టి ఏడుకొండలు పాల్గొన్నారు.



వృద్ధులకు స్వీట్లు పంచుతున్న నిర్వాహకులు

ఉద్యమాలే ఊపిరిగా గాదిరాజు శ్రీరామరాజు ప్రస్థానం



శ్రీరామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

గొల్లలకోడేరులో శ్రీరామరాజు వర్ధంతి సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

శ్రీరామరాజు భార్య పేరున విశ్రాంతి వేదిక ప్రారంభం

నాన్న ఆశయాలను కొనసాగిస్తా

శ్రీరామరాజు కుమారుడు, మాజీ సర్పంచి సూర్యనారాయణరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

సంపన్నుల కుటుంబంలో గాదిరాజు శ్రీరామరాజు పుట్టినప్పటికీ నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు పెత్తందారులకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు చేసి పేదలకు అండగా నిలబడ్డారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. ప్రజాఉద్యమాలకు ఊపిరిపోసిన శ్రీరామరాజు జీవితం ప్రజా ఉద్యమాలకు ఆదర్శనీయమని, ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజానాయకుడు, సిపిఎం నేత గాదిరాజు శ్రీరామరాజు 32వ వర్ధంతి ఆయన స్వగ్రామమైన గొల్లలకోడేరులో శ్రీరామరాజు కుమారుడు, మాజీ సర్పంచి గాదిరాజు సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరాజు స్వగృహం నుంచి శ్రీరామరాజు చిత్రపటంతో సిపిఎం నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు గ్రామంలోని శ్రీరామరాజు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీరామరాజు విగ్రహానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీరామరాజును స్మరిస్తూ సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో సీతారాం మాట్లాడారు. చదువుకునే సమయంలో రాజకీయాల్లోకి రావడానికి గాధిరాజు శ్రీరామరాజు తనను ప్రోత్సహించి, పార్టీ సభ్యత్వం కూడా ఇచ్చారని గుర్తు చేశారు. తన యావత్తు జీవితాన్ని ప్రజా ఉద్యమాలకే అంకితం చేశారని కొనియాడారు. రైతాంగ పోరాటాలకు నాయకత్వం వహించి జిల్లాస్థాయి ఉద్యమాలను ఎన్నో చేపట్టారని గుర్తు చేశారు. జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ శ్రీరామరాజు చాలా విలక్షణ నాయకుడని, సమస్యలు వచ్చినప్పుడు వాటి పరిష్కారం కోసం చాతుర్యతతో పరిష్కరించే వారన్నారు. పార్టీ వర్గ దృక్పథానికి లోబడి చివరి వరకు ఉండటం ఎంతో ఆదర్శనీయమన్నారు. జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ శ్రీరామరాజు జీవితం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్రంలో ఎందరో పాలకులు మారినప్పటికీ జనం జీవన స్థితిగతులు మారలేదన్నారు.



వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

శ్రీరామరాజు ఆశయాలను కొనసాగిస్తా కుమారుడు, మాజీ సర్పంచి సూర్యనారాయణరాజు

తండ్రి శ్రీరామరాజు పోరాటాలు, ఉద్యమ జీవితం తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని ఆయన కుమారుడు సూర్యనారాయణరాజు తెలిపారు. శ్రీరామరాజు వర్ధంతి సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకత్వం నడుమ జరగడం సంతోషంగా ఉందన్నారు. నాన్న శ్రీరామరాజు ఆశయాలను ముందుకు తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం సూర్యనారాయణరాజు ఆర్థిక సహకారంతో శ్రీరామరాజు సతీమణి అప్పల నరసాయమ్మ పేరున నిర్మించిన విశ్రాంతి వేదికను మంతెన సీతారాం ప్రారంభించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు కె.క్రాంతిబాబు, డి.పెద్దిరాజు, సిపిఎం నేతలు దున్న మరియమ్మ, తాడి రామారావు, గ్రామస్తులు కాజా వీరస్వామి, సింహాచలం, నాగేశ్వరరావు, నేతల గోపీ, సమలదీవి వెంకన్న, అప్పారావు, గంటి శ్రీనివాస్, రిటైర్డ్ ఉపాధ్యాయులు గొట్టుముక్కల రామలింగరాజు (మాస్టారు), ఒడుగు వెంకటేశ్వరరావు, శ్రీరామరాజు కుటుంబ సభ్యులు, గొల్లలకోడేరు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పాలకోడేరులో

పాలకోడేరులోని ప్రజా సంఘాల కార్యాలయంలో శ్రీరామరాజు 32వ వర్ధంతిని వ్యవసాయ కార్మిక సంఘం, రైతుసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యకాస మండల అధ్యక్షులు అసిరియ్య శ్రీరామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



భీమవరంలో భరద్వాజ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీతారాం, బలరాం, నేతలు, కుటుంబ సభ్యులు

ఉద్యమాల నిర్వహణలో భరద్వాజ ప్రత్యేకత వేరు

ప్రజాశక్తి - భీమవరం

ఉక్కు క్రమశిక్షణతో ప్రజాఉద్యమాలు నిర్వహించడంలో అమరజీవి వత్సవాయి భరద్వాజ ప్రత్యేకత వేరని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. భరద్వాజ 29వ వర్ధంతి సభ భీమవరంలోని ఆయన సతీమణి సత్యవతి నివాసంలో జరిగింది. తొలుత భరద్వాజ్ చిత్రపటానికి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1961 నుండి 1980 వరకు ఎయిర్‌ఫోర్సులో పని చేసి రిటైర్‌మెంట్ అనంతరం సిపిఎం ఉద్యమాలు, పోరాటాల్లో పాల్గొని క్రమశిక్షణతో పని చేశారన్నారు. సిపిఎం నరసాపురం పట్టణ కార్యదర్శిగా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులుగా అనేక ప్రజాఉద్యమాలను భరద్వాజ్ నిర్వహించారన్నారు. యువజన సంఘం ఆధ్వర్యంలో ఆచంట మండలంలో శ్రమదానం ద్వారా రోడ్ల నిర్మాణం చేపట్టి ప్రజల మన్ననలు పొందారన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీకి సత్యవతి రూ.5 వేలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు, భరద్వాజ సతీమణి వత్సవాయి సత్యవతి, కుమారుడు వత్సవాయి శ్రీనివాసరాజు, శిరీష, జె.వెంకటలక్ష్మి, వడుగు వెంకటేశ్వరరావు, ఖండవల్లి వెంకన్న పాల్గొన్నారు.



ఆచంట మండలం కరుగోరుమిల్లిలో..

ఆచంట: క్రమశిక్షణకు మారుపేరు వత్సవాయి భరద్వాజ అని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఇందుకూరి సూర్యనారాయణరాజు అన్నారు. వత్సవాయి భరద్వాజ 29వ వర్ధంతి సందర్భంగా కరుగోరుమిల్లిలోని ఆయన స్తూపం వద్ద తొలుత జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరాజు మాట్లాడగా నాయకులు బొర్రా ధర్మారావు, పిల్లి శ్రీరాములు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

నరాల బలహీనతపై ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - భీమవరంరూరల్

లయన్స్ క్లబ్ ఆఫ్ భీమవరం ఆధ్వర్యాన అవిస్ హాస్పిటల్ హైదరాబాద్ వారి సౌజన్యంతో కాళ్ల నరాల బలహీనతలు, బోద కాళ్ల వ్యాధికి సంబంధించి ప్రముఖ వైద్యులతో స్థానిక ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన లయన్స్ రీజినల్ ఛైర్మన్ ఆర్‌విఎస్.సూర్యనారాయణరాజు, మొదటి ఓపి కార్డును వసుధ ఫౌండేషన్ మంతెన కృష్ణంరాజుకు అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ భీమవరం అధ్యక్షులు నందమూరి, లయన్స్ సెక్రటరీ నరహరిశెట్టి కృష్ణ, ట్రెజరర్ బొండా రాంబాబు మాట్లాడుతూ దాదాపు 150 మందికిపైగా రోగులకు సేవలందించినట్లు తెలిపారు. అవిస్ హాస్పిటల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ పవన్ మాట్లాడుతూ పేదలకు వైద్యం అందించాలనే ఆలోచనతో ఈ శిబిరంలో పాలుపంచుకున్నామన్నారు. ముగ్గురు పేద విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను అందించారు.



సైకిళ్లు అందిస్తున్న నిర్వాహకులు

చినవెంకన్న ఆలయంలో వేసవి రక్షణ చర్యలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

చినవెంకన్న ఆలయానికి వచ్చే యాత్రికులు వేసవిలో ఆలయ ప్రదక్షణకు, క్యూలైన్లలో ఇబ్బంది పడకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా యాత్రికులు రాకపోకలు సాగించే ప్రధాన రాజగోపురం రాతి మెట్లదారిలో ఎండవేడి పాదాలకు తగలకుండా రక్షణగా మెట్లదారిపై నీటిని విడుదల చేస్తున్నారు. ఆలయ ఆవరణలో కొబ్బరి పీచు కార్పెట్లను ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో శ్రీవారి దర్శనార్థం వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం కొన్ని ప్రాంతాల్లో కూలర్లను ఏర్పాటు చేశారు. ఆలయ అనివేటి మండపం బయట ఉన్న జంట వృక్షాల నీడలోనూ, అనివేటి మండపంలోనూ కూలర్లు ఏర్పాటు చేశారు. అవసరానికి అనుగుణంగా యాత్రికులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆలయ ఇఒ వేండ్ర త్రినాథరావు తెలిపారు.



11న సామాజిక చైతన్య పాదయాత్ర

ప్రజాశక్తి - పాలకొల్లు

దళితులు, బలహీనవర్గాల న్యాయం కోసం సామాజిక చైతన్య పాదయాత్ర ఈ నెల 11న జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా నిర్వహిస్తున్నట్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శివదేవుని చిక్కాల నుంచి ఉదయం 8 గంటలకు ప్రారంభమై బల్లిపాడు, దగ్గులూరు, లంకలకోడేరు, భగ్గేశ్వరం, పూలపల్లి మీదుగా పాలకొల్లు వరకూ సామాజిక చైతన్య యాత్ర జరుగుతుందని చెప్పారు. పాదయాత్రలో ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ సోదరులు, టిడిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. జగన్ అధికారంలోకి వచ్చిన 4 సంవత్సరాల్లో దళితులు, బిసిలపై యథేచ్ఛగా దాడులు జరుగుతున్నాయన్నారు. బిసి, ఎస్సిలకు జరుగుతున్న అన్యాయంపై పాలకొల్లులో సామాజిక చైతన్య పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు.


ప్రముఖ చిత్రకారుడు వెంపటాపును సత్కరిస్తున్న ప్రముఖులు

చిత్రకారుడు వెంపటాపునకు సత్కారం

ప్రజాశక్తి - తణుకు రూరల్

విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో కొలుసు ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ చిత్ర కళా ప్రదర్శన జరిగింది. తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నలభై మంది చిత్రకారులు వారు చిత్రించిన చిత్రాలు ప్రదర్శించారు. ఈ మేరకు చిత్రకారుడు డాక్టర్ వెంపటాపు 'ఇన్ మెడిటేషన్' శీర్షికతో కాంటెంపరరీ శైలిలో చిత్రించిన పెయింటింగ్ ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, కొలుసు ఆర్ట్ ఫౌండేషన్ ఫౌండర్ కొలుసు సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్, ఫైనార్ట్స్ డిపార్ట్మెంట్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇ.శ్రీనివాస రెడ్డి, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సిఇఒ ఇ.శివ నాగిరెడ్డి, ప్రెసిడెంట్ స్టేట్ బిసి వెల్ఫేర్ అసోసియేషన్ ఎల్.వెంగళరావు యాదవ్, గొల్ల నారాయణరావు, ప్రముఖ చిత్రకారుడు శిల్పి శేషబ్రహ్మం, అల్లు రాంబాబు వెంపటాపును ప్రశంసాపత్రం, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తణుకు జెడ్‌పి బాలుర హైస్కూల్ హెచ్ఎం కోట శివ ప్రసాద్, టి. ఉమ, జిజె.ప్రభువరం, కనకదుర్గేశ్వరి, సీతామహాలక్ష్మి, వీరభద్రం ఆయనను అభినందించారు.

ఎఎంసి ఛైర్మన్ బాబుకు సత్కారం

ప్రజాశక్తి - వీరవాసరం

మంచి కార్యాలు చేసేవారికి ఏసుక్రీస్తు దేవెనలు ఎల్లవేళలా ఉంటాయని వడ్డిగూడెం మహిమ మర్నాత స్వస్థతశాల రెవ. పి.సజీవరావు అన్నారు. ఆదివారం భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబును వడ్డిగూడెం సర్పంచి సైదు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా కోటిపల్లి బాబు మాట్లాడుతూ ఏసుక్రీస్తు మార్గంలోనే అందరం నడవాలన్నారు. కార్యక్రమంలో వీరవాసరం గ్రామ వైసిపి అధ్యక్షుడు నూకల కనకారావు, వడ్డిగూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.


ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడుతున్న ఎఎస్‌పి సుబ్బరాజు

ఘనంగా హరికథ సప్తాహ మహోత్సవాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం త్యాగరాజ భవనంలో చెరుకువాడ సోదరుల నిర్వహణలో హరికథ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం హరికథ భాగవతరాణి పురాణం విజయలక్ష్మి (రాజమండ్రి) శ్రీరామ సుగ్రీవ మైత్రి హరికథ అద్భుతంగా ప్రదర్శించారు. దీనికి సహ వాయిద్యాలుగా పాలపర్తి ఆంజనేయులు (విజయవాడ), మృథంగంతో కాపవరపు సుబ్బారావు (భీమవరం) వయోలిన్‌తో సహకరించారు. ఈ కార్యక్రమం సాగి అచ్చుత రామరాజు జ్ఞాపకార్థం వారి కుమారుడు సాగి విఠల్‌రంగరాజు సహకారంతో నిర్వహించినట్లు చెరుకువాడ సోదరులు తెలిపారు. ఎఎస్‌పి సుబ్బరాజు జ్యోతి ప్రజ్వలన చేసి కళాకారులను సత్కరించారు. కళలకు పుట్టినిల్లు విజయనగరం అని, హరికథకు విజయనగరం ఆదిపట్ల నారాయణదాసు పునాది వేశారని అనడంలో గర్వంగా చెబుతున్నానని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గంధం వెంకట విశ్వేశ్వరరావు, తిరువీధి వెంకటేశ్వర్లు, మాజీ ఎంఎల్‌సి బొమ్మిడి నారాయణరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నందమూరి రాజేష్, నీలాతీ పోతయ్య పాల్గొన్నారు.

పేదల ఉన్నతికి విశ్వనాథం కృషి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని అరట్లకట్టలో సిపిఐ సీనియర్ నాయకులు దొమ్మేటి విశ్వనాథం సంస్మరణ సభ ఆయన నివాసం వద్ద ఆదివారం జరిగింది. సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దొమ్మేటి విశ్వనాథం పార్టీ పట్ల అచంచలమైన విశ్వాసం, నమ్మకంతో అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. పార్టీ నిర్వహించిన అనేక ఉద్యమ పోరాటాల్లో తనవంతు పాత్ర నిర్వహించారన్నారు. యువజన సమాఖ్య, వ్యవసాయ కార్మిక సంఘంలో పనిచేశారన్నారు. గ్రామ ఉప సర్పంచిగా పనిచేసిన విశ్వనాథం పేద వర్గాల ఉన్నతికి ఎంతగానో శ్రమించి గ్రామ ప్రజల మన్ననలు పొందారన్నారు. విశ్వనాథం మృతి పార్టీకి తీర్చలేనిదని కొనియాడారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు నెక్కంటి సుబ్బారావు సంస్మరణ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ పార్టీ నాయకునిగా నిరంతరం ప్రజల సమస్యలు పరిష్కారానికి దొమ్మేటి విశ్వనాథం ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి వాసురాజు, మాజీ సర్పంచి కైలా నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నెక్కంటి జగదాంబ పాల్గొని నివాళులర్పించారు.


మాట్లాడుతున్న సిపిఐ నేత కోనాల భీమారావు


నిలిచిపోయిన ఆర్‌ఒబి నిర్మాణ పనులు


రైల్వే గేటు వద్ద వేచి ఉన్న వాహనదారులు

నిలిచిన ఆర్ఒబి పనులు!

వాహనదారులు, ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - ఉండి

పామర్రు నుంచి పాలకొల్లు వరకూ 165వ జాతీయ రహదారిలోని ఉండి రైల్వే గేట్ వద్ద నిర్మిస్తున్న ఆర్ఒబి పనులు ఏడు నెలలుగా నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 16 అక్టోబర్ 2020వ తేదీన ప్రతిష్టాత్మకంగా ఉండి కుర్మావారివీధి నుండి గోరింతోట వరకూ 1.35 కిలోమీటర్ల మేర నిర్మించ తలపెట్టిన ఆర్ఒబికి 90.99 కోట్ల రూపాయల వ్యయం అంచనా వేశారు. ఈ ఆర్ఒబి నిర్మాణానికి సుమారు 600 కుటుంబాల వారిని ఖాళీ చేయించి వారికి ప్రభుత్వం చెల్లించిన నష్టపరిహారం ఏమాత్రమూ సరిపోదని బహిరంగ మార్కెట్ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని మొరపెట్టుకున్న అధికారులు పట్టించుకోకుండా ఖాళీ చేయించారు. అటువంటి ఆర్ఒబి పనులు కరోనా సమయంలో కూడా చురుగ్గా సాగాయి. తరువాత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల మందకొడిగా సాగి ఇటీవల పూర్తిగా నిలిచిపోయాయి. గుడివాడ నుంచి నరసాపురం వరకూ డబుల్ రైల్వే లైను వేయడం వల్ల నరసాపురం నుండి వెళ్లే రైళ్ల సంఖ్య పెరుగుతుందని భావించిన ఈ ప్రాంత ప్రజలకు రైల్వే శాఖ భారీ షాక్ ఇచ్చింది. ఈ రైల్వే లైన్లో ఎక్కువ శాతం గూడ్స్, తక్కువ శాతం ప్రయాణికులు ఉపయోగించే రైళ్లు వెళ్లడంతో ప్రతి 20 నిమిషాలకోసారి రైల్వే గేట్ పడుతోంది. దీంతో ప్రయాణికులు ఎండలో సుమారు 20 నిమిషాల పాటు నిలబడి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ఒబి పనులు పూర్తయితే ఇన్ని అవస్థలు పడనవసరం లేదని అంటున్నారు. కేవలం గూడ్స్ రైళ్ల కోసమే డబుల్ రైల్వే లైన్ వేసారా అని వాహనదారులు వాపోతున్నారు. ఉండిలో 2020లో మొదలుపెట్టిన ఆర్ఒబి పనులు పూర్తి చేయకుండా ఆలపాడు వద్ద ఆర్ఒబి నిర్మాణం పనులు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పట్లో ఆర్ఒబి పనులు పూర్తయ్యే పరిస్థితి లేకపోవడంతో ఇంకెన్ని సంవత్సరాలు రైల్వే గేటు పడితే గంటల తరబడి ఎండలోనే నిలబడాలని వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అప్పు చెల్లించలేదని వ్యక్తి హత్య!

నిడదవోలు కాలువలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఇటీవల అదృశ్యమైన వ్యక్తి నిడదవోలు కాలువలో శనివారం రాత్రి శవమై తేలాడు. హత్య చేసి కాలువలో పడేశారని పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నెలమూరు గ్రామానికి చెందిన కేతా నరసింహస్వామి (30) కూలి చేసుకుని భార్య శైలజ, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. ఈనెల నాలుగో తేదీన పని కోసం భీమవరం వెళ్తున్నానని భార్యతో చెప్పి నరసింహస్వామి ఇంటి నుంచి బయలుదేరాడు. అయితే అదే రోజు సాయంత్రం ఫోన్ చేసినా అందుబాటులో లేకపోవడంతో శైలజ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. భీమవరానికి చెందిన నిందితులు వెంకట్, రాజేష్, ఆదినారాయణ, గోపాలం వద్ద నరసింహస్వామి రూ.3 లక్షలు అప్పు తీసుకున్నాడు. వాటికోసం ముగ్గురు నిందితులు నరసింహస్వామిని నిడదవోలు పిలిపించారు. బకాయి చెల్లించాలని నరసింహస్వామిని అడగడంతో వారి మధ్య ఘర్షణ నెలకొంది. ఈ నేపథ్యంలో నిందితులు నరసింహస్వామిని కాలువలోకితోసేసి పారిపోయారు. ముగ్గురికి మరో నలుగురు సహకరించినట్లు దర్యాప్తులో తేలిందని ఎస్ఐ బి.సురేంద్రకుమార్ తెలిపారు. నిందితులు నెలమూరు విఆర్ఒ మురళీకృష్ణకు లొంగిపోయారని, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.

ద్విచక్ర వాహనాలు చోరీ

యువకుడు అరెస్టు
15 మోటార్ సైకిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - మొగల్తూరు

ద్విచక్ర వాహనాలు చోరీకి పాల్పడుతున్న యువకుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని డిఎస్‌పి కె.రవి మనోహరాచారి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోడు పాలెంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన యల్లమొల్లి మున్నాబాబు (26) దొంగతనాలకు అలవాటు పడ్డాడు. 2019లో అంబాజీపేట పోలీసులు ద్విచక్ర వాహన చోరీ కేసులో మున్నాబాబును అరెస్టు చేసి 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. 2021 ఫిబ్రవరిలో జైలు నుంచి బయటికొచ్చిన మున్నాబాబు మరలా చోరీలకు పాల్పడుతున్నాడని తెలిపారు. ఇటీవల మొగల్తూరు మండలంలోని పేరుపాలెం సౌత్ పంచాయతీ పరిధి మాలపర్రు బీచ్‌లో చోరీ చేసి ద్విచక్ర వాహనాలను సర్వే తోటలో భద్రపర్చాడని తెలిపారు. ఈస్టర్ సందర్భంగా బీచ్‌కు వచ్చే వారి రక్షణ నిమిత్తం పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించగా ఆ సమయంలో అనుమానంగా ద్విచక్ర వాహనంపై వచ్చిన మున్నా బాబును ప్రశ్నించి అతని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అతని వద్ద నుంచి సుమారు 7 లక్షల విలువగల 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న సిఐ వాడవెల్లి సురేష్‌బాబు, ఎస్ఐ ఎం.వీరబాబు, సిబ్బంది ఆర్.వెంకటేశ్వరరావు, శీలం బాబూజీ, పాల అశోక్ కుమార్, నల్లం రాజేష్‌ను అభినందించారు.


నిందితుడు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో పోలీస్ అధికారులు


ఆటో బోల్తా.. మహిళకు గాయాలు

ప్రజాశక్తి - పెనుగొండ

జాతీయ రహదారి దొంగరావిపాలెం నుండి తణుకు వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మహిళ తలకు బలమైన గాయమైంది. ఆమెను అంబులెన్స్‌లో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె తాడేపల్లిగూడెం చెందిన కట్టా దేవిగా గుర్తించారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.


గాయపడిన కట్టా దేవి

పలుచోట్ల 'జగనన్నే మా భవిష్యత్తు'


ఉండి : గ్రామస్తులతో మాట్లాడుతున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని 17వ వార్డు అచ్చుగట్లపాలెంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వార్డు ఇన్‌ఛార్జి, చినగోపురం ఛైర్మన్ గాదె వెంకన్న సారథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. పేదలు, మధ్య తరగతి ప్రజలు తిరిగి జగన్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని చెప్పారు.

ఉండి : మండలంలోని ఎండగండి, చెరుకువాడ, అర్తమూరు గ్రామాల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైసిపి నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు మాట్లాడుతూ గతంలో పార్టీలు విజయం సాధించిన తర్వాత ఎన్నికల మేనిఫెస్టోను తొలగించే వారని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నుంచి ఇప్పటివరకు ఎన్నికల మేనిఫెస్టోను పూర్తిగా అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వాలంటీర్లు పనిచేస్తున్నారన్నారు. వాలంటీర్లకు తోడుగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లను నియమించారని, వారు సమన్వయంతో ప్రజలకు సేవలందించాలని తెలిపారు. కార్యక్రమంలో చేబ్రోలు బాలాజీ, వేగేశ్న వేణు, గోనబోయిన వెంకటేశ్వరరావు, టోనీ బాబు, జొన్నల వజ్రం పాల్గొన్నారు.


పాలకొల్లు : గ్రామస్తులతో మాట్లాడుతున్న వైసిపి నేతలు


ముత్యాలమ్మ ఆలయంలో అధిక సంఖ్యలో వచ్చిన జనం

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెంబీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటలో సహపంక్తి భోజనాలు చేశారు.


సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు


మొగల్తూరులో అన్నదానం

పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని రామాలయం, రాజగోపాలస్వామి దేవస్థానం ఆలయ ప్రాంగణంలో ఆదివారం భారీ అన్న సమారాధన చేశారు. శ్రీరామనవమి వేడుకల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అన్న సమాధానలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వహణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

పాలకొల్లు రూరల్: ఉల్లంపర్రు గ్రామ దేవతలైన వెగుల్లమ్మ, చల్లాలమ్మ గోగుల్లమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రెసిడెంట్ పాశర్ల సింహాచలం, సెక్రటరీ రావడ వెంకటేశ్వరరావు, బొడ్డు శ్రీనివాసరావు, పాశర్ల వెంకట రమణ పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలో ఈస్టర్ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చర్చిల్లో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ పండుగను పురస్కరించుకుని అన్ని చర్చిలను అందంగా తీర్చిదిద్దారు. కాళ్ల, కాళ్లకూరు, జువ్వలపాలెం, ఏలూరుపాడు, కలవపూడి, దొడ్డనపూడి, సీసలి, జక్కరం, బొండాడ, కోపల్లె, వేంపాడు, పెదఅమిరంలో ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పెనుగొండ : మండలంలో ఈస్టర్ పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునుంచే క్రైస్తవ సోదరులు సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సిద్ధాంతం సెయింట్ థామస్ లూథరన్ చర్చి రెవ జె.యేసురత్నం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని 14 గ్రామాల్లోని క్రైస్తవ ప్రార్థనామందిరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

మొగల్తూరు : మండలంలోని పలు గ్రామాలలో క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాధులను పువ్వులు, విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.